# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 293 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | శుక్రవారం 12-06-2026 | పేజీలు : 2




## జనగామలో టీఆర్పీ పొలిటికల్ గర్జన

- బహుజనులకే రాజ్యాధికారం
- అగ్రవర్ణాల పాలనకు చరమగీతం పాడుతాం
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్

2



## ఆలోచనలకు బ్రేక్.. సెర్చ్ బటన్‌కే లైక్.!

### AI కు బానిసవుతున్న యువత..!

- విద్యార్థుల జ్ఞాపకశక్తిపై తీవ్ర ప్రభావం
- తగ్గుతున్న ఏకాగ్రత, సహనం
- పలు నగరాల్లో వెలుస్తున్న AI కళాశాలు
- సృజనాత్మకతకు పడుతన్న సంకెళ్లు
- ప్రతి చిన్న సందేహానికి AI పైనే ఆధారం
- టెక్నాలజీని కోచ్ లా వాడుకోవాలి
- మేధోశక్తి యజమానిగా కాదు
- హెచ్చరిస్తున్న సాంకేతిక నిపుణులు
- ఆలోచనా శక్తికి పదును పెట్టాలని సూచన

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** సాంకేతిక విప్లవం మానవ జీవితాన్ని సులభతరం చేస్తోంది. కానీ, అదే సాంకేతికత ఇప్పుడు యువత ఆలోచనా శక్తికి సంకెళ్లు వేస్తోందా? అంటే 'అవును' అనే సమాధానమే వినిపిస్తోంది. నేటి తరం యువత, ముఖ్యంగా విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) యాప్‌లకు విపరీతంగా బానిసవుతున్నారు. ప్రతి చిన్న సందేహానికి గూగుల్ సెర్చ్ బటన్ నొక్కడం లేదా AI చాట్‌బాట్‌లను ఆశ్రయించడం ఒక అలవాటుగా మారిపోయింది. ఈ ధోరణి విద్యార్థుల జ్ఞాపకశక్తి, సృజనాత్మకతపై తీవ్ర ప్రభావం చూపుతోందని సాంకేతిక నిపుణులు, విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు ఏదైనా ఒక అంశంపై సందేహం వస్తే

తరువాయి 2లో...

## కాంగ్రెస్‌లో కోవర్టుల కలకలం

### ఇన్‌ఛార్జికే తప్పని వెన్నుపోటు..

### తెలంగాణ కాంగ్రెస్‌లో పరాకాష్టకు చేరిన అసంతృప్తి

### ఇన్‌ఛార్జ్‌పై సీనియర్ల పగకు కారణాలేంటి?





- మీనాక్షికి సొంత పార్టీ నేతల ఝలక్
- ఢిల్లీ లెవెల్లో దెబ్బకొట్టిన కోల్డ్ వార్
- రాష్ట్ర లీడర్ల మధ్య అంతుచిక్కని పోరు
- ఇన్‌ఛార్జి శైలిపై అసంతృప్తే కారణమా..
- రాజ్యసభ రేసు నుంచి మీనాక్షి ఔట్
- వెనుక ఉన్నది తెలంగాణ హస్తమేనా..?
- మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యలతో ఇంటి దొంగల గుట్టురట్టు
- అసలు అంత అవసరం ఎవరికొచ్చింది?
- క్షేత్రస్థాయి కేడర్‌లో గందరగోళం..
- అధిష్టానం యాక్షన్ తీసుకుంటుందా..?

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు కొత్త కాదు. కానీ కోవర్ట్ రాజకీయాలు ఇప్పుడు పరాకాష్టకు చేరాయి. సాధారణంగా ప్రత్యర్థి పార్టీలపై వ్యూహాలు రచించాల్సిన నేతలు... సొంత పార్టీకి చెందిన జాతీయ స్థాయి మహిళా నేత, అది కూడా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మీనాక్షి నటరాజన్ రాజకీయ ఎదుగుదలకు సొంత చేతులతోనే సమాధి కట్టడం రాష్ట్ర రాజకీయాన్నే ఒక మలుపు తిప్పింది. మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి రాజ్యసభ నామినేషన్ల తిరస్కరణ వెనుక ఉన్న సాంకేతిక లోపాలను వెతికి పట్టుకోవడం కంటే... ఆ సమాచారాన్ని ప్రత్యర్థి పార్టీకి చేరవేసి వెన్నుపోటు పొడిచిన ఇంటి దొంగలు ఎవరనే చర్చ ఇప్పుడు గాంధీ భవన్‌లో కాకరేపుతోంది. ఇది కేవలం ఒక నామినేషన్ తిరస్కరణ వ్యవహారం కాదు... తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గతంగా ముదురుతున్న ప్రచ్ఛన్న యుద్ధానికి ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలేంటే.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక ఢిల్లీ లేదా భోపాల్ లీడర్లు లేరు... పక్కా తెలంగాణ మార్క్ కాంగ్రెస్ కోవర్టులే ఉన్నారనే ప్రచారం రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. అసలు మాకు ఈ విషయమే తెలియదంటూ మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి చేసిన వ్యాఖ్యలు... తెలంగాణ కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ల అసంతృప్తి ఏ స్థాయికి చేరిందో స్పష్టం చేస్తోంది. మంత్రివర్గ విస్తరణలో తమకు ప్రాధాన్యత దక్క లేదన్న కక్షో... లేక అధిష్టానం వద్ద

తరువాయి 2లో...



## అంతా కెమికల్స్

### హైదరాబాద్‌లో పాలు తాగి మూడు రోజులు ఆస్పత్రి పాలయ్యా..

- 20 ఏండ్లలో ఎప్పుడూ జ్వరం రాలే..
- మామిడి పండ్లు తినాలంటేనే వణుకు
- ప్రకృతి వ్యవసాయం దిశగా రైతాంగం నడవాలి
- యూరియాకు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నం
- రూ.1.20 లక్షల కోట్ల యూరియా దిగుమతి చేసుకోవడం బాధకరం
- కేంద్ర మంత్రి బండి సంజయ్

2

### అత్యధిక వేడి కలిగిన

## టాప్-30 నగరాల్లో హైదరాబాద్..!

### వేగంగా పెరిగిన నగరీకరణ, పచ్చదనం తగ్గడమే కారణం

- ఈ వేసవిలో 47 రోజులు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి
- ప్రపంచంలోని 205 ప్రధాన నగరాలపై ఈ పరిశోధన
- భారత్లో హైదరాబాద్ తో పాటు మరో 14 రాష్ట్రాలకు వేడి ముప్పు



**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రపంచంలోని 30 నగరాల జాబితాలో హైదరాబాద్ స్థానం సంపాదించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తాజాగా వెల్లడించిన ఒక అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పర్యావరణ ముప్పులకు ఈ నివేదిక అద్దం పడుతోంది. హైదరాబాద్లో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పర్యావరణ మార్పులు, నగరాలపై చూపుతున్న ప్రభావాన్ని ఈ నివేదిక స్పష్టంగా చూపిస్తోంది. "మూవింగ్ బియాండ్ ఎక్స్‌పోజర్" పేరిట ప్రపంచ వ్యాప్తంగా 205 ప్రధాన నగరాలపై ఈ పరిశోధన నిర్వహించారు. కేవలం గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాకుండా, నగరాల్లోని కూలింగ్ సదుపాయాలు, పచ్చదనం, సామాజిక-ఆర్థిక పరిస్థితులు వంటి వివిధ అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ నివేదికను రూపొందించారు.

తరువాయి 2లో...



## ఓయూలో ఏంజేస్తుండ్రు..?

- మూల్యాంకన విధానంపై స్టూడెంట్స్ ఫైర్
- ఫలితాల్లో పెద్దసంఖ్యలో ఫెయిల్
- రీవాల్యుయేషన్‌లో భారీగా పాస్
- ఫెయిల్ అయిన 1500 మందిలో వెయ్యి మంది పాస్
- రీవాల్యుయేషన్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఫస్ట్ గ్రేడ్ మార్కులు
- చర్చనీయాంశంగా మారిన వాల్యుయేషన్

2

## రూ.100 కోట్లతో రేవంత్ ఇల్లు



- ఇనుప కంచెలకే రూ.17 కోట్లు
- పుట్‌బాల్ ఆడేందుకు రూ.10 కోట్లు
- కౌన్సిల్‌లోనూ ప్రత్యేకంగా సీఎం ఛాంబర్
- పని చేయని సీఎంకు ఇన్ని ఎందుకు..?
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధుల్లేవ్..
- సీఎం సోకులకు రూ.వందల కోట్లా..?
- మాజీ మంత్రి హరీశ్ రావు

2



2

## 'రాజ్యాధికార సమరభేరి'కి వేలాదిగా తరలి రావాలి

### జూలై 5న భువనగిరి సభను విజయవంతం చేయాలి

టీఆర్పీ రాష్ట్ర నాయకుల పిలుపు

## టీఆర్ఎస్ టైటిల్ వార్

- కవిత పార్టీ పేరుపై రోజుకో వివాదం
- ఇప్పటివరకు 700లకు పైగా ఫిర్యాదులు
- తాజాగా ఈసీని ఆశ్రయించిన సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్
- కవిత కంటే ముందే రిజిస్టర్ చేసుకున్నా..
- పార్టీ పేరు ఉంటుందా..? పోతుందా..?
- రాజకీయవర్గాల్లో పెద్దఎత్తున చర్చ

2


## మళ్లీ ఇంధన సంక్షోభం..!



- హర్మూజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్
- అమెరికా దాడులకు ప్రతిచర్యగా నిర్ణయం
- చమురు ట్యాంకర్లే లక్ష్యంగా దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరిక
- గంటల వ్యవధిలోనే భారీగా పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు
- భారత్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం
- పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగేఅవకాశం

2





# జనగామలో టీఆర్పీ పొలిటికల్ గర్జన

- బహుజనులకే రాజ్యాధికారం
- అగ్రవర్ణాల పాలనకు చరమగీతం పాడుతాం
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్
- టీఆర్పీలోకి అగ్రవర్ణ పార్టీ లీడర్ల క్యూ
- భువనగిరి సమరభేరికి జనగామ నుంచి 10 వేల మంది
- టీఆర్పీ శ్రేణులకు కట్ల సదానందం దిశానిర్దేశం

**శనార్తి తెలంగాణ, జనగామ :** జనగామ జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. నియోజకవర్గంలోని వివిధ ప్రధాన పార్టీలకు చెందిన పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)లో చేరారు. జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో భారీ చేరికలు జరిగాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్.. చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాధం రజిని కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఆశించిన స్థాయిలో రాజకీయ ప్రాధాన్యత దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగుతున్న అగ్రవర్ణాల రాజకీయ ఆధిపత్యాన్ని అంతం చేయడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర సంపదను సృష్టించే బహుజన వర్గాలకే రాజకీయ అధికారం దక్కాలని, అణగారిన వర్గాలన్నీ ఐక్యంగా నిలిస్తే తెలంగాణ రాజకీయాల్లో చారిత్రాత్మక మార్పు ఖాయమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం మాట్లాడుతూ.. జూలై 5న భువనగిరిలో నిర్వహించ తలపెట్టిన 'రాజ్యాధికార సమరభేరి' బహిరంగ సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు జనగామ జిల్లా నుంచి కనీసం 10 వేల మందిని తరలించేందుకు పక్కా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సభ విజయవంతం కోసం ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జిని నియమిస్తూ బాధ్యతలను గ్రామ స్థాయికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తున్న పలువురు నాయకులకు ఈ సందర్భంగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర నాయకులు పోలు రాజు, కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ మార్త శ్రీనివాస్, హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణతో పాటు జనగామ జిల్లా నేతలు దిలీప్, బబ్లు, కృష్ణ, విష్ణు, జలీల్, రమేష్, లింగం, రాజ్ కుమార్, నర్సింహారావు, రాణి, మురళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచనలకు బ్రేక్..

**మొదటిపేజీ తరువాయి...**

పుస్తకాలు తిరగేయడం, ఆలోచించడం, నలుగురితో చర్చించడం చేసేవారు. కానీ ఇప్పుడు AI పుణ్యమా అని క్షణాల్లో సమాధానం చేతికి దొరుకుతోంది. దీనివల్ల విద్యార్థుల్లో కష్టపడే తత్వం, సహనం పూర్తిగా తగ్గిపోతున్నాయి. సమాచారం సులువుగా దొరుకుతుండటంతో విషయాలను గుర్తుంచుకోవాలనే తపన లోపించి, జ్ఞాపకశక్తి మందగిస్తోంది. ఏదైనా ఒక విషయంపై నిమిషాల పాటు కూడా ఏకాగ్రత నిలపలేకపోతున్నారు. పాఠశాల ప్రాజెక్టుల నుంచి కాలేజీ అసైన్‌మెంట్‌ల వరకు అంతా AIమయమైపోయింది. సొంతంగా ఆలోచించి రాయాల్సిన వ్యాసాలు, కోడింగ్, డిజైనింగ్‌లను సైతం AI టూల్స్‌తో పూర్తి కానిచ్చేస్తున్నారు. దీనివల్ల యువతలో దాగి ఉన్న సహజ సిద్ధమైన క్రియేటివిటీ నశించిపోతోంది. సరికొత్త ఆలోచనలు చేయడానికి బదులు, స్క్రీన్‌లపై వచ్చే సమాధానాలకే 'లైక్' కొడుతూ మేధస్సుకు తుప్పు పట్టిస్తున్నారు. సాంకేతికతకు ఉన్న క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు పలు నగరాల్లో ప్రత్యేకంగా 'AI కాలేజీలు', కోర్సులు వెలుస్తున్నాయి. ప్రాథమిక అవగాహన, సొంత ఆలోచనా శక్తి లోపించిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరినా సొంతంగా ఆలోచించే శక్తి ఉందని, బుద్ధి మందగిస్తుంది. సాంకేతిక నిపుణులు, విద్యావేత్తలు యువతకు కీలక సూచన చేస్తున్నారు. టెక్నాలజీని లేదా AIని ఒక 'కోచ్' లా అంటే మేధస్సుకు మార్గదర్శి లాగా మాత్రమే వాడుకోవాలి. మన సందేహాలను నివృత్తి చేసుకునేందుకు, నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు దాన్ని ఒక సాధనంగా ఉపయోగించాలే తప్ప.. మన మేధోశక్తికి దాన్ని 'యజమాని'ని చేయకూడదు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు వెంటనే AIని ఆశ్రయించకుండా, మొదట సొంతంగా ఆలోచించి పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు.

## అత్యధిక వేడి కలిగిన...

**మొదటిపేజీ తరువాయి...**

ఒక కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ నగరానికి 'హీట్ వల్నరబిలిటీ ఇండెక్స్'లో 0.68 స్కోర్ లభించింది. ఈ జాబితాలో కైరో, మనీలా వంటి అంతర్జాతీయ నగరాల సరసన హైదరాబాద్ నిలిచింది.

ఈ ఏడాది వేసవిలో హైదరాబాద్ నగరం గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతటి తీవ్రమైన ఎండలను చవిచూసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 మధ్యకాలంలో సుమారు 47 రోజులు పాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. నగరం వేగంగా విస్తరించడం, పచ్చదనం క్షీణించడం, తగ్గిన కూలింగ్ సదుపాయాలు అందరికీ అందుబాటులో లేకపోవడం వంటి కారణాలు ఈ ముప్పును మరింత తీవ్రం చేస్తున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. భారత్‌లోని అహ్మదాబాద్, నాగ్‌పూర్, మదురై నగరాల్లో హైదరాబాద్ కంటే ఎక్కువ ముప్పు ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. కాగా ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి నగరాల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణ ముప్పును ఎదుర్కొంటున్న టాప్–50 నగరాల్లో 14 భారత్‌కు చెందినవే కావడం గమనార్హం.

## టీఆర్ఎస్ టైటిల్ వార్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ పేరు చుట్టూ తిరుగుతున్న వివాదం రోజురోజుకూ మరింత సంక్లిష్టంగా మారుతోంది. కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన తెలంగాణ రాష్ట్ర సేన పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల 'తెలంగాణ రక్షణ సేన'గా మార్పు చేసిన సంగతి తెలిసిందే. ఈ పేరుపై ప్రజాభిప్రాయం, అభ్యంతరాల స్వీకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఊహించని స్థాయిలో స్పందన వస్తోంది. ఈ వివాదంలో సరికొత్త ట్విస్ట్ ఇస్తూ మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తి ఈసీని ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్డ్యాల్ అనే వ్యక్తి.. కవిత తన పార్టీ పేరును ప్రకటించడానికి ఒక్క రోజు ముందే 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' (టీఆర్ఎస్) అనే పేరును కేటాయించాలంటూ ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. రెండు పార్టీల పేర్లకూ షార్ట్‌కట్ 'టీఆర్ఎస్' అనే వస్తుండటంతో ఇప్పుడు సాంకేతికంగా కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఈసీ ఇచ్చిన పత్రికా ప్రకటనకు గాను.. ఇప్పటివరకు దాదాపు 700కు పైగా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. గతేడాది ఏప్రిల్ 25న పార్టీ ఆవిర్భావ వేడుకల్లో కవిత తన పార్టీ పేరును ప్రకటించగా, తదనంతరం ఈసీ 'రక్షణ సేన' పేరును ఖరారు చేసింది. కానీ తాజా అభ్యంతరాల నేపథ్యంలో ఈ పేరు కవిత పార్టీకి దక్కుతుందా లేదా అనేది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు, ఈ పేరు కేటాయింపును భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధిష్ఠానం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ మేరకు ఈసీకి అధికారికంగా ఫిర్యాదు కూడా చేసింది. వందలాది అభ్యంతరాలు, మహారాష్ట్ర వ్యక్తి దరఖాస్తు, బీఆర్ఎస్ వ్యతిరేకతల మధ్య ఎన్నికల సంఘం 'టీఆర్ఎస్' పేరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## కాంగ్రెస్‌లో కోవర్టుల కలకలం

**మొదటిపేజీ తరువాయి...**

తమ పట్టు కోల్పోతున్నామన్న ఆందోళనో గానీ... ఏకంగా హైకమాండ్ ప్రతినిధికే ఝలక్ ఇచ్చే స్థాయికి ఈ కోల్డ్ వార్ చేరింది.

**బీజేపీకి అస్త్రాలు అందించిన సొంత నేతలు**

మీనాక్షి నాటరాజన్ తన రాజ్యసభ నామినేషన్ పత్రాల్లో కొన్ని కేసుల వివరాలను పొందుపరచలేదనే సాంకేతిక కారణంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆమెపై ఉన్న కేసుల గురించిన పూర్తి సమాచారాన్ని, పక్కా ఆధారాలను మధ్యప్రదేశ్ బీజేపీ నాయకులకు చేరవేసింది మరెవరో కాదు... తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలేనని అక్కడి ఒక మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణ కాంగ్రెస్ లీడర్లు చెప్పేంత వరకు మీనాక్షి నటరాజన్ కేసుల విషయం మాకు కూడా తెలియదు' అని సదరు మంత్రి వ్యాఖ్యానించడం విశేషం. ఈ వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లోని కోవర్టు రాజకీయాన్ని నగ్నంగా సమాజం ముందు నిలబెట్టాయి. విపక్షాలకు సైతం దొరకని సమాచారాన్ని సొంత పార్టీ ఇన్‌ఛార్జిపైనే ప్రయోగించి, ఆమె పొలిటికల్ కెరీర్‌ను దెబ్బతీయడం కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటల పరాకాష్టకు అద్దం పడుతోంది.

**ఎందుకీ అంతర్గత యుద్ధం? ఎవరికి లాభం?**


ఈ వ్యవహారం బయటకు వచ్చినప్పటి నుంచి గాంధీ భవన్ వర్గాల్లో ఒకటే చర్చ... 'అసలు మన ఇన్‌ఛార్జిని ముంచేయాల్సిన అవసరం మనోళ్లకేం వచ్చింది?'. అందులో ప్రధానంగా ఇన్‌ఛార్జి శైలిపై అసంతృప్తి ఉండడమో.. అధిష్ఠానం వద్ద పట్టు కోసమో.. ఈ తరహా వెన్నుపోటుకు దిగినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ గ్రూపు రాజకీయాలను అణచడానికి లేదా కొన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ, మరికొన్ని వర్గాలను పక్కన పెడుతున్నారనే కోపంతో కొందరు సీనియర్లు ఈ స్కెచ్ వేసి ఉండొచ్చు. ఇన్‌ఛార్జిని బలహీనపరిస్తే, హైకమాండ్ వద్ద తమ మాట నెగ్గుతుందనే అత్యాశ సైతం కారణం అయ్యిండొచ్చు. కానీ, ఈ క్రమంలో వారు మర్చిపోయిన విషయం ఏంటంటే... ఇన్‌ఛార్జి ప్రతిష్ఠ దెబ్బతింటే అది నేరుగా అధిష్ఠానంపై అలాగే రాష్ట్రంలో పార్టీ క్యాడర్ మనోధైర్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ లేదా ఇతర కీలక పదవుల భర్తీ విషయంలో మీనాక్షి నటరాజన్ తమకు అనుకూలంగా వ్యవహరించలేదని కొందరు లీడర్లు గుర్రుగా ఉన్నారు. అధిష్టానం వద్ద తమకు అనుకూలంగా లాబీయింగ్ చేయడంలో ఆమె అలసత్వం ప్రదర్శించిందని, అందుకే ఆమెకు ఈ రకంగా 'రిటర్న్ గిఫ్ట్' ఇచ్చారని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రత్యర్థులను ఎదుర్కోవడంలో కంటే... సొంత పార్టీ నేతలను తొక్కేయడంలోనే తెలంగాణ కాంగ్రెస్ లీడర్లు ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారనేది బహిరంగ రహస్యం. గతంలో ఎంతోమంది ఇన్‌ఛార్జ్‌లు గ్రూపు రాజకీయాలను భరించలేక చేతులెత్తేశారు. ఇప్పుడు మీనాక్షి నటరాజన్ విషయంలో ఏకంగా వెన్నుపోటు రాజకీయాలకు తెరలేపడం ద్వారా అధిష్టానానికే తెలంగాణ నేతలు సవాల్ విసిరినట్లయింది.

**పరాకాష్టకు చేరిన కోల్డ్ వార్..**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పుడు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. గల్లీ లీడర్ల మధ్య కోల్డ్ వార్ ఉంటే ఇన్‌ఛార్జిలు సర్దుబాటు చేస్తారు. కానీ ఇక్కడ ఏకంగా ఇన్‌ఛార్జికే లీడర్లు సమాధి కడుతుంటే... ఇక రాష్ట్రంలో పార్టీని కాపాడేదెవరు? అనే ప్రశ్న తలెత్తుతోంది. సొంత పార్టీ ఇన్‌ఛార్జిపైనే ఇంతటి కోవర్టు రాజకీయానికి పాల్పడిన సదరు నేతలు... రేపు ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీలతో ఎలాంటి లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌ను తీవ్ర రక్షణాత్మక స్థితిలోకి నెట్టేసింది. ఒక మహిళా నేత అని కూడా చూడకుండా, బీజేపీ నేతలతో చేతులు కలిపి సొంత పార్టీ ఇన్‌ఛార్జిని దెబ్బతీసిన ఆ 'కోవర్టులు' ఎవరు అనే కోణంలో అధిష్ఠానం నిఘా పెట్టినట్లు సమాచారం. ఈ సంక్షోభం నుంచి తెలంగాణ కాంగ్రెస్ ఎలా గట్టెక్కుతుంది? సదరు కోవర్టులపై హైకమాండ్ కఠిన చర్యలు తీసుకుంటుందా? లేక ఎప్పటిలాగే సర్దుబాటు ధోరణితో వదిలేస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా... ఈ మీనాక్షి ఝలక్ ఎపిసోడ్ తెలంగాణ కాంగ్రెస్ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోనుంది.

## రూ.100 కోట్లతో రేవంత్ ఇల్లు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి తన నివాసం సమీపంలో సుమారు రూ.100 కోట్ల భారీ వ్యయంతో బోధి పెవిలియన్ పేరిట సరికొత్త నివాస భవనాన్ని నిర్మిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. 'ఈ విలాసవంతమైన భవన పనులను పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి పదుల సంఖ్యలో పర్యటనలు చేశారు. కేవలం ఇనుప కంచెల కోసమే రూ.17 కోట్లు, భద్రతతో పాటు ఫుట్‌బాల్ ఆడుకునేందుకు వీలుగా మరో రూ.10 కోట్లు కేటాయించారు. ఇవి చాలదన్నట్లు శాసనమండలిలో సీఎం కోసం ప్రత్యేకంగా మరో ఛాంబర్‌ను సిద్ధం చేస్తున్నారు.' అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో సరిగా పనిచేయని ముఖ్యమంత్రికి ఇన్ని క్యాంప్ ఆఫీసులు ఎందుకని ప్రశ్నించారు. మొదట రూ.7 కోట్లతో జీవో జారీ చేసి, ఇప్పటివరకు ఏకంగా రూ.70 కోట్లకు పైగా ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర నిధులు లేవు కానీ, సీఎం విలాసాల కోసం వందల కోట్లు ఎలా ఖర్చు పెడతారంటూ హరీశ్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక సొంత పార్టీ నేతల హస్తమే ఉందంటూ హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వమే ఆమెకు వెన్నుపోటు పొడిచిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వ్యక్తిగత కేసు వివరాలను బీజేపీ నేతలకు లీక్ చేసిన ఆ అంతర్గత శత్రువు ఎవరో తేల్చాలన్నారు.

## 'రాజ్యాధికార సమరభేరి'కి వేలాదిగా తరలి రావాలి

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ "రాజ్యాధికార సమరభేరి" కి వేలాదిగా తరలిరావాలని టీఆర్పీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పలువురు రాష్ట్ర నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. దీనిలో భాగంగా గౌడ్ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (GOPA) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ బండి సాయన్న గౌడ్ కు పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్పీ నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయం, బీసీల రాజకీయ సాధికారత, అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ ప్రధాన కార్యదర్శి V. మదనోహన చారీ , రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్,రాష్ట్ర నాయకులు బిక్షపతి, కడారి శ్రీనివాస్, శ్రీనిధి పాల్గొన్నారు.

**ఆర్. కృష్ణయ్యకు ఆహ్వాన పత్రిక అందజేత**

"రాజ్యాధికార సమరభేరి" ఆహ్వాన పత్రికను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ బీసీ ఉద్యమ నాయకుడు శ్రీ ఆర్. కృష్ణయ్యకు టీఆర్పీ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్ గారు, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్ గారు, కడారి శ్రీనివాస్ గారు, అర్కటి శ్రీనిధి గారు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జగన్ కు..**

టీఆర్పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమర భేరి" ఆహ్వాన పత్రికను రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీ జగన్ గారికి పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ ప్రధాన V. మదన్మోహన, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్,రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్, కడారి శ్రీనివాస్, అర్కటి శ్రీనిధి, రాజు పాల్గొన్నారు.

**గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షుడు శంకర్ కు**

రాజ్యాధికార సమరభేరి" ఆహ్వాన పత్రికను గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షుడు శ్రీ శంకర్ కు టీఆర్పీ నాయకులు అందజేశారు. టీఆర్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్ చారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్, కడారి శ్రీనివాస్, అర్కటి శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

**బీసీ జేఏసీ కమిటీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ కు**

"రాజ్యాధికార సమరభేరి" ఆహ్వాన పత్రికను బీసీ జేఏసీ కమిటీ చైర్మన్, ప్రముఖ బీసీ ఉద్యమ నాయకులు శ్రీ జాజుల శ్రీనివాస్ గౌడ్ పార్టీ నాయకులు అందజేశారు. టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి V.మదనోహన చారీ, ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్,కడారి శ్రీనివాస్ అర్కటి శ్రీనిధి, రాజు పాల్గొన్నారు.

**కుమ్మెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ రావుకు**

"రాజ్యాధికార సమరభేరి" ఆహ్వాన పత్రికను కుమ్మెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జయంత్ రావు గారికి పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. మదన్ మోహన్ చారి, ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్, కడారి శ్రీనివాస్, అర్కటి శ్రీనిధి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో...

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల మూల్యాంకన విధానంపై మరోసారి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వెలువడిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు, ఆ తదుపరి రీవాల్యుయేషన్ పరిణామాలు ఓయూ పరీక్షల విభాగం పనితీరును ప్రశార్థకంగా మార్చాయి. ఇటీవల ప్రకటించిన ఎల్ఎల్‌బీ ఫలితాల్లో సుమారు 1,500 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గత సెమిస్టర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కూడా ఇందులో ఉండటంతో పేపర్ల దిద్దుబాటుపై అనుమానాలు మొదలయ్యాయి. దీంతో చాలా మంది విద్యార్థులు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా విడుదలైన రీవాల్యుయేషన్ ఫలితాల్లో ఊహించని నిజాలు వెలుగుచూశాయి. మొదట ఫెయిల్ అయిన వారిలో దాదాపు 1,000 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించారు. అంతకంటే విచిత్రంగా.. మొదట ఫెయిల్ అయినట్లు ప్రకటించిన వారిలో ఎనిమిది మంది విద్యార్థులకు రీవాల్యుయేషన్ తర్వాత ఏకంగా 'ఫస్ట్ గ్రేడ్' మార్కులు రావడం గమనార్హం. మొదటిసారి దిద్దినప్పుడు ఫెయిల్ అయిన విద్యార్థులకు, రెండోసారి అంత భారీగా మార్కులు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని, అసలు మొదటి మూల్యాంకన ప్రక్రియ ఎంతవరకు నమ్మశక్యంగా జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. రీవాల్యుయేషన్ ఫీజుల రూపంలో యూనివర్సిటీకి ఆదాయం పెంచుకోవడానికే కావాలని విద్యార్థులను ఫెయిల్ చేస్తున్నారనే అనుమానాలను కొందరు విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలకు తగిన ఆధారాలు లేనప్పటికీ, విశ్వవిద్యాలయ యంత్రాంగం దీనిపై అధికారికంగా స్పందించి విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



## అంతా కెమికల్స్

**శనార్తి తెలంగాణ, కరీంనగర్ :** 20 ఏండ్లలో నాకు ఎన్నడూ జ్వరం రాలేదని, కానీ ఇటీవల హైదరాబాద్‌లో పాలు తాగి మూడు రోజుల పాటు ఆస్పత్రిలో చేరాల్సి వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రకృతి వ్యవసాయం – రైతు సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "గడిచిన 20 ఏళ్లలో నాకు ఎప్పుడూ జ్వరం రాలేదు. బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలు కూడా లేవు. ప్రధాని నరేంద్ర మోదీయే నా ఆరోగ్యానికి స్ఫూర్తి. ఇటీవల హైదరాబాద్‌లో పాలు తాగి మూడు రోజుల పాటు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది" అని పేర్కొన్నారు. భూమి అంతా రసాయనాలతో నిండిపోతోందని, రోగాలకు కారణం మనమేనని, వాటిని నివారించాల్సింది కూడా మనమేనని ఆయన హితవు పలికారు. రసాయన ఎరువుల కోసం దేశ సంపద విదేశాల పరం కావడంపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లను యూరియా కోసం కేటాయిస్తున్నామని, అందులో రూ.1.20 లక్షల కోట్ల సొమ్మును విదేశాలకు పంపి యూరియా దిగుమతి చేసుకోవడం బాధాకరమన్నారు. దేశ సొమ్ము విదేశాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకే ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నారని స్పష్టం చేశారు. "రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటాం. ఈ పద్ధతి ద్వారా పండించిన పంటలకు మంచి మద్దతు ధర లభించేలా కేంద్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం" అని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

## మళ్లీ ఇంధన సంక్షోభం..!

**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల కీలకమైన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తున్నట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) గురువారం ప్రకటించింది. అమెరికా సైన్యం ఇరాన్‌కు చెందిన హోర్మోజ్‌గాన్ ప్రాంతంపై క్షిపణులతో విరుచుకుపడటమే దీనికి ప్రధాన కారణం. కేవలం మిలిటరీ స్థావరాలనే కాకుండా సిరిక్ కౌంటీలోని వాటర్ ప్లాంట్లను అమెరికా టార్గెట్ చేయడంతో దాదాపు 20,000 మంది స్థానికులకు తాగునీరు అందకుండా పోయింది. ఈ పరిణామం అటు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనకు, ఇటు రెండు దేశాల మధ్య దశాబ్దాల నాటి శత్రుత్వాన్ని తెరతీసింది. అమెరికా ఆర్మీకి చెందిన అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందనే నెపంతో యూఎస్ సెంట్రల్ కమాండ్ (CENTCOM) ఈ దాడులకు తెగబడింది.

ప్రతీకారంగా హర్ముజ్ జలసంధి మార్గం గుండా వెళ్లే ఏ రకమైన చమురు ట్యాంకర్లు, వాణిజ్య నౌకలనైనా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. దీంతో అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాకు ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి.ఇరాన్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. కాల్పుల విరమణ తర్వాత భారీగా తగ్గిన ధరలు.. తాజా పరిస్థితులతో గంటల వ్యవధిలోనే రెండు శాతం పెరిగాయ్. దీంతో భారత్ వంటి దేశాలపై మరోసారి తీవ్ర ప్రభావం పడింది. కాగా ఈ పరిణామాలతో మరోసారి దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే సముద్ర మార్గ చమురు రవాణాలో దాదాపు 25 శాతం వాటా ఈ హోర్ముజ్ జలసంధి ద్వారానే సాగుతుంది..!